13



## జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

■ నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికే జాబ్ మేళా ■ ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్


# ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 11 ఫిబ్రవరి 2026 | ■ 13 పేజీలు




# నేడే మున్సిపల్ సమరం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మున్సిపల్ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటరన్న ఎవరిని కరుణిస్తాడోనని ఆయా అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. వారం రోజుల పాటు ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. గెలుపుపై ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తున్నారు. వార్ వన్ సైడేనని కాంగ్రెస్ పార్టీ నేతలు అంటుండగా, మళ్లీ మేమే మెజార్టీ స్థానాల్లో గెలుపొంది అధికారాన్ని చేజిక్కించుకుంటామని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ అని మేజిక్ ఫిగర్ దాటి మున్సిపాలిటీలపై కాషాయం జెండాను ఎగుర వేస్తామని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులతోపాటు ఆయా పార్టీల్లో టిక్కెట్లు ఆశించి భంగపడ్డ నాయకులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి, కొందరు స్వతంత్రంగా బరిలో దిగారు. వీరి మధ్యనే ప్రధానంగా పోటీ జరిగింది. వారం రోజులుగా రాజకీయ పార్టీలు నిర్వహించిన హోరాహోరీ ప్రచారం ముగియడంతో, ఇప్పుడు బంతి ఓటర్ల కోర్టులోకి చేరింది. సుమారు 1600 మంది అభ్యర్థుల భవితవ్యం బుధవారం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం కానుంది. శాంతిభద్రతల దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

- ■ నేడే మున్సిపల్ ఎన్నికల పోలింగ్..
- ■ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి
- ■ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు
- ■ ఉ॥7గంటల నుంచి సాయంత్రం 5గం॥ వరకు
- ■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 328 వార్డులు..
- ■ పోటీలో 1600 మంది అభ్యర్థులు
- ■ ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు..
- ■ పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది, సామగ్రి
- ■ పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు
- ■ వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ
- ■ ప్రత్యేక ఆకర్షణగా గ్రీన్ పోలింగ్ కేంద్రాలు
- ■ మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు
- ■ ఎన్నికలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు
- ■ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- ■ ఉమ్మడి జిల్లా పోలీసుల అధికారులు..

-ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి





## ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

10

- ■ నిర్లక్ష్యంపై కఠిన చర్యలు ■ పోలింగ్ సిబ్బంది అన్ని సౌకర్యాల కల్పన
- ■ బ్యాలెట్ బాక్సులు, కిట్‌లు క్షుణ్ణంగా పరిశీలించాలి
- ■ పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- ■ సిబ్బందికి పలు సూచనలు ■ నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్
- ■ బైంసాలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల తనిఖీ

### తమ్ముడిని కాపాడబోయి

## అన్నదమ్ములు మృతి

- ■ తమ్ముడిని కాపాడేందుకు బావిలోకి దూకి అనంతలోకాలకు అన్న..
- ■ ఇద్దరి మృతితో ఉట్నూర్ మండలం ఉమ్రి కోలాంగూడలో విషాద ఛాయలు



8

### సెలవనుకోకు..

## బాధ్యత మరువకు..!

ఓటు హక్కు సద్వినియోగంతోనే పట్టణాల అభివృద్ధి ప్రగతికి బాటలు పడాలంటే ఓటు వేయాల్సిందే



ప్రజాస్వామ్య సౌధం ఓటు అనే వజ్రాయుధంపైనే నిర్మితమైంది. ఈ ఆయుధాన్ని ఉప యోగించి ప్రజలు తమకు నచ్చిన వారిని పాలకులుగా ఎన్నుకునేందుకు వీలుంటుంది. నచ్చకపోతే అదే ఓటుతో గద్దెదింపేందుకూ అవకాశం ఉంది. మంచివారు అధికారంలోకి రావాలన్నా, పారదర్శక పాలన కావాలన్నా.. ఓటును సద్వినియోగం చేసుకోవడం ముఖ్యం. ఓటు హక్కును పొందకపోవటం ఎంత తప్పో.. దాన్ని వినియోగించ కపోవటం అంతే పొరపాటు. అందుకే అందరూ నడుం బిగించాలి. దిశగా అడుగేయాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఈ హక్కుని ప్రతి ఒక్కరూ వినియోగించుకుంటేనే అసలైన జనస్వామ్యం.

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు





- 1000 సిబ్బందితో పోలీసు బందోబస్తు
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో స్పెషల్ పార్టీ బలగాలు
- పట్టణంలో 200 మంది వ్యక్తులు బైండోవర్
- 80 మందిపై మద్యం కేసులు నమోదు
- రూ.30 లక్షల నగదు స్వాధీనం
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు జిల్లా పోలీసు వ్యవస్థ పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డుల్లో ఎన్నికలు జరగనుండగా, అందులో 14 రూట్లుగా విభజించి, 62 పోలింగ్ లొకేషన్స్, 216 పోలింగ్ బూత్‌లున్నాయి. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1000 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా ఎస్పీ స్వయంగా పట్టణంలోని పలువు సమస్య ఆత్మక ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించి, ప్రజలను ఓటు హక్కుపై అవగాహన కల్పించి నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రలోభాలకు గురి కాకూడదని తెలిపారు. ఈరోజు నుండి పోలింగ్ స్టేషన్లో పరిధిలో 163 బిఎన్‌ఎస్‌ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, ప్రజలు గుమ్మిగూడి ఉండకుండా, గొడవలకు అల్లర్లకు దారి తీయకుండా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకొని, ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సమస్యలు సృష్టించేటటువంటి వారిని, ఎన్నికలను గొడవలు సృష్టించే వారిని 200 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 20 మంది వద్ద ఉన్న ఆయుధాలను సేఫ్ డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. ఈ బందోబస్తు నందు 53 మంది ఫారెస్ట్, టిజిఎస్పి, ఏసీబీ, జైళ్ల శాఖ, లీగల్ మెట్రాలజీ, ఎలక్ట్రిసిటీ, ఆర్టిసి, సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికలలో 35 క్రిటికల్ పోలింగ్ లొకేషన్స్ ఉండగా అందులో ప్రత్యేకంగా 40 సీఐ మరియు ఎస్ఐ స్థాయి అధికారులచే స్టాటిక్ ఫోర్స్ తో మరియు స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బందోబస్తు ప్రక్రియలో పోలింగ్ స్టేషన్లో, 14 రూట్ మొబైల్స్ లో, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటుచేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ బందోబస్తు నందు ముగ్గురు అదనపు ఎస్పీలు, 3 డిఎస్పీలు, 21 మంది సీఐలు, 48 ఎస్సై లతో, మహిళా సిబ్బంది, హోంగార్డ్స్, రిజర్వ్ సిబ్బంది, సాయుధ సిబ్బంది, స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 10 వార్డులకు ఒక అదనపు ఎస్పి, డిఎస్పి స్థాయి అధికారులచే ప్రత్యేకంగా పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని 100 మీటర్ల వద్ద 200 మీటర్ల వద్ద ప్రత్యేక నియమ నిబంధనలు ఉంటాయని వాటిని పాటించాలని, ప్రజల అనవసరంగా గుమిగూడి ఉండరాదని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలోనికి సెల్ఫోన్లు, వాటర్ బాటిల్‌లు, ఇంకు బాటిల్లు, ఆయుధాలు, పెన్నులు, అగ్నికి సంబంధించిన వాటికి అనుమతులు ఉండవని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ పద్ధతిని పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాలలోనికి అనుమతి ఇస్తారని తెలిపారు. తమ వెంట ఓటర్ ఐడి కార్డులను, గుర్తింపు కార్డులను తెచ్చుకోవాలి. వాట్సాప్ నందు సోషల్ మీడియా నందు ఇతరులకు రెచ్చగొట్టేలా కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై పోలీసు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రచారాలు ముగిసిన సందర్భంలో బయట వ్యక్తులు గ్రామాలలో ఉండరాదు. ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని, గొడవలకు, అల్లర్లకు పాల్పడకూడదు. ఎన్నికలు పూర్తయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, అధికారుల అనుమతితో నిర్ధారించిన రోజులలో అనుమతి తీసుకుని నిర్వహించుకోవాలి. టపాకాయలు పేల్చరాదు. సున్నితమైన ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజలలో పోలీసుల పట్ల ధైర్యం నమ్మకం పెంపొందించేందుకు కృషి చేయడం జరిగిందని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినమైన చర్యలతో విధులను నిర్వర్తిస్తుందని తెలిపారు. ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసు సహాయాన్ని సంప్రదించవచ్చని, అటువంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల మాత శిశు ఆసుపత్రిని ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్యాధికారులతో కలిసి సందర్శించి వార్డులు, ల్యాబ్, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, గర్భిణీలు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించుకునేలా అవగాహన కల్పించడంతో పాటు పోషక ఆహారం, మందులు అందించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, శిశువులకు సమయానుసారంగా అందించవలసిన టీకాలను తప్పనిసరిగా వేయాలని సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలు, ఇతర సదుపాయాలకు సంబంధించి ప్రతిపాదనలు అందించాలని, అవసరం మేర సమకూర్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను

# విజయవంతం చేయాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దిపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో లీడ్ డిస్ట్రిక్ట్ మేనెజర్ తిరుపతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఆర్. సెటి డైరెక్టర్ ఆశిష్, సిఎఫ్ఎల్ కౌన్సిలర్లతో కలిసి కార్యక్రమ సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 9 నుండి 13వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు-2026 కార్యక్రమం ద్వారా ప్రజలకు కె.వై.సి. మోసం, మనీమ్యూల్, ఫస్ట్ స్టెప్ టు సేఫ్ బ్యాంకింగ్ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు కె.వై.సి. ప్రాముఖ్యత, మోసాలు, డిజిటల్ అరెస్ట్ అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. వారోత్సవాలలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని బ్యాంకుల మేనేజర్ల ఆధ్వర్యంలో 118 సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాలకు స్వయం సహాయక సంఘాలు, రైతులు, ఖాతాదారులు, మహిళలు, వృద్ధులు, పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### పోలింగ్ నేపథ్యంలో ప్రభుత్వ

# ఉద్యోగులకు సాధారణ సెలవు

**మంచిర్యాల, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**



2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియలో మున్సిపల్ పరిధిలో ఓటు హక్కు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల ఉద్యోగులు పోలింగ్ రోజున ప్రత్యేక సాధారణ సెలవు సద్వినియోగం చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో జింక మృతి

## కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు

**ఖానాపూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని ఇక్బాల్‌పూర్ గ్రామ సమీపంలో ఎక్స్ రోడ్డుపై వెళ్తున్న కారుకు జింక ఢీకొట్టడంతో జింక మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఖానాపూర్ మండలంలోని ఇక్బాల్‌పూర్ ప్రాంతంలో అటవీ ప్రాంతం నుంచి అకస్మాత్తుగా రోడ్డు దాటుతున్న జింకను నిర్మల్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. కారు జింకను ఢీకొట్టడంతో రోడ్డు ప్రమాదంలో జింక అక్కడికక్కడనే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది పైలెట్ హఫీజ్, టెక్నీషియన్ హరీష్ గాయపడిన వారిని ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించారు. అటవీ ప్రాంతానికి సమీపంలో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని పోలీసులు, అటవీశాఖ అధికారులు సూచించారు. అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
బంజారాల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జయంతి ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారని, ఆయన జయంతి వేడుకలను గౌరవప్రదంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ నెల 18 న జిల్లాకేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గిరిజన తండాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వేడుకల ప్రాంగణాల్లో తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ రద్దీ నివారణకు అవసరమైన మళ్లింపులు చేపట్టాలని సూచించారు. పార్కింగ్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సేవాలాల్ మహారాజ్ బోధనలు, ఆయన సమాజ సేవలను యువతకు తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సేవాలాల్ జయంతి వేడుకలకు సంబంధించిన పోస్టర్ ను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పీఓ యువరాజ్ మర్మట్, గిరిజన సంక్షేమ శాఖ, పోలీస్ శాఖల అధికారులు, బంజారా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అనిత



**జన్నారం, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ అనిత మంగళవారం జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యులు వైద్య సిబ్బందితో వైద్య ఆరోగ్య కార్యక్రమాల పైన సమీక్ష చేయడం జరిగింది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు మరియు వ్యాక్సినేషన్ కార్యక్రమము వ్యాక్సిన్ నిలువలను ప్రతి బుధవారము శనివారము వ్యాక్సినేషన్ కార్యక్రమాలను వందశాతం పూర్తి చేయాలని సరైన సమయంలో టీకాలు అందించాలని ఆదేశించారు అదేవిధంగా వైద్య ఆరోగ్య కార్యక్రమాల టార్గెట్ల పైన వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉపకేంద్రం పరిధిలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని వారికి కేటాయించిన గ్రామాలలో సందర్శనలు చేయాలని ఇంటింటికి తిరిగినప్పుడు తల్లులు గర్భవతులు వృద్ధులు, చిన్న పిల్లలతో మాట్లాడడం వారికి వైద్య ఆరోగ్య కార్యక్రమాల గురించి తెలియజేయాలని ముఖ్యంగా వాతావరణ మార్పులతో వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని కీటక జనిత వ్యాధులైన దోమలు కుట్టడం ద్వారా వచ్చే మలేరియా డెంగ్యూ చికెన్ గునియా లాంటివి ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, క్షయ నియంత్రణలో భాగంగా మారుమూల ప్రాంతాలలో మొబైల్ ద్వారా పరీక్షలు చేస్తున్నట్లు తెలియజేశారు ముఖ్యంగా ఆశ్రమ పాఠశాలలో రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరోగ్య అవగాహన శిబిరాలను పెట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఉమశ్రీ వైద్య సిబ్బంది సి హెచ్ ఓ వెంకటేశ్వర్లు డిపిఓ ప్రశాంతి కొల్లూరి కమలాకర్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా చూడాలి

## నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల

**ముథోల్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరిగేలా చూడాలని భైంసా సబ్ డివిజన్ అధికారులతో జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. మంగళవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, మార్గదర్శకం చేస్తూ మాట్లాడారు. ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# నష్ట పరిహారం చెక్కు అందజేత

**మంచిర్యాల, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని క్యాతనపల్లి మీదుగా చేపట్టిన జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్యతో చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్యాతనపల్లి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన 19 మందికి చెందిన 1 కోటి 32 లక్షలు 70 వేల 382 రూపాయల చెక్కును వెంకటస్వామి, రజితలకు అందించడం జరిగిందని తెలిపారు.





## బాసర మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం
### ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

**ముథోల్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
బాసర మండల కేంద్రంలో రూ.92 లక్షల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రామారావు పటేల్ మంగళవారం శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని రూ.20 లక్షల నిధులతో డ్రెయిన్ నిర్మాణం, రెండు అంగన్వాడి కేంద్రాల ఏర్పాటు, అలాగే రూ.21 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలోని ఆలయ ఆవరణలో రూ.7 లక్షల నిధులతో తాగునీటి పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కిర్గుల్ గ్రామంలో పాఠశాల విద్యార్థుల భద్రత దృష్ట్యా రూ.10 లక్షల నిధులతో ప్రహరీ గోడ నిర్మాణానికి, మహిళల సంక్షేమం కోసం రూ.10 లక్షల నిధులతో మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో ఫ్లాగ్ మార్చ్



- నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- పాల్గొన్న వందమంది స్పెషల్ పార్టీ బలగాలు
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కలగూడ, అబ్దుల్లా చౌక్, ఖానాపూర్, అంబేద్కర్ నగర్, ప్రాంతంలలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో విస్తృత ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో 100 మంది స్పెషల్ పార్టీ బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొని ప్రధాన వీధుల్లో మార్చ్ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. డబ్బు, మద్యం, బహుమతులు వంటి ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను విజయవంతం చేయడంలో పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే సోషల్ మీడియా వేదికలలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేయరాదని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించినా వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన మౌనిక, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీ జీవన్ రెడ్డి, సిఐలు సునీల్ కుమార్, ప్రసాద్, ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా స్థానిక టీటీడీసి కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరైన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, సామగ్రి పంపిణీ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, పేపర్ సీల్స్, స్టేషనరీ కిట్‌లను స్వీకరించే సమయంలోనే సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, లోపాలు గమనించినట్లయితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది కేటాయించిన వాహనాల్లో సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ అనంతరం డైరీలు, రిజిస్టర్లు, సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం స్వీకరించేందుకు రిసెప్షన్ కౌంటర్లను పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల అమలులో ఎలాంటి అజాగ్రత్త వహించినా లేదా విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది తమ బాధ్యతలను నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి నిర్వర్తించాలని సూచించారు. ప్రతి దశలో చెక్‌లిస్టులను అనుసరిస్తూ సామగ్రి స్వీకరణ, పోలింగ్ నిర్వహణ, రిసెప్షన్ ప్రక్రియలను క్రమబద్ధంగా పూర్తి చేయాలని ఆదేశించారు. శాంతియుత, స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు హనుమంతు నాయక్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, మున్సిపల్ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**ఓటు హక్కు ప్రజల చేతుల్లో వజ్రాయుధం**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ప్రజాఆయుధం అని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటును వినియోగించుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోని, జిల్లాలో వంద పోలింగ్ శాతం నమోదుకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఓటు హక్కు వినియోగించాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, సమాజంలోని అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా ఓటు వేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జిల్లాయం త్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉందని, ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించాలని సూచించారు.

**ఉద్యోగులకు సాధారణ సెలవు...**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియలో మున్సిపల్ పరిధిలో ఓటు హక్కు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల ఉద్యోగులు పోలింగ్ రోజున ప్రత్యేక సాధారణ సెలవు సద్వినియోగం చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

**వంద శాతం పోలింగ్ నమోదుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**
















# ఎన్నికలకు పటిష్ట బందో బస్తు

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీసీపీ భాస్కర్




**బెల్లంపల్లి, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల నిర్వహణతో పాటు అనంతర కార్యక్రమాలకు సంబంధించిన అవసర చర్యలు చేపట్టుతున్నామని మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాలు రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లు, బెల్లంపల్లి, రామక్రిష్ణపూర్, మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను మంచిర్యాల ఏసిపి ఆరు ప్రకాష్ బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోదరావు, మందమర్రి సీఐ రమేష్, శ్రీరాంపూర్ సీఐ శ్రీలత, పోలింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పాఠశాలలోని గదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించి ఓటర్లు ఓటు వినియోగించుకునే రూమ్లో విద్యుత్ వెలుగు స్పష్టంగా ఉండాలని గాలి వెలుతురు స్పష్టంగా వచ్చేలా ఉండాలని, అలాగే తాగునీరు అందుబాటులో ఏర్పాటు చేయాలన్నారు. ఓటు హక్కును స్వేచ్ఛయుతమైన వాతావరణంలో తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. మరింత పగడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచనలు అందించారు. బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్‌లతో పాటు, పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లో వాటి భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు,ఆర్మ్డ్ గార్డులు, సైన్ ఫ్లెక్సీలు, కౌంటింగ్ సమయంలో ఎవరికీ అనుమతి ఇవ్వాలి, తీసుకోవలసిన జాగ్రత్తలు,పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు.ఏర్పాట్ల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తుందని తెలిపారు.



## పోస్టల్ సేవలను విస్తృతం చేయాలి

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
పోస్టల్ బ్యాంకింగ్ సేవలను గిరిజన గ్రామాల్లో విస్తృతం చేసి గిరిజనులు సద్వినియోగం చేసుకునేలా పోస్టల్ సిబ్బంది పని చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తపాలా సూపరింటెం డెంట్ బోరెడ్డి గుంపస్వామి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తపాలా కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోస్టాఫీసు లోని పాలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సిబ్బంది ఇంటింటికి వెవెళ్లి పోస్టల్ శాఖలో ఉన్న పొదుపు ఖాతాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలంతా నిత్యం అందుబాటులో ఉండే పోస్టాఫీసులను వినియోగించుకొని పోస్టల్ సేవలు పొందేలా పని చేయాలని సూచించారు. ఎస్బీ, ఆర్డి, సుకన్య సంవృద్ధి, ఆర్పిఎస్ఐఐ, పీఎస్ఐ, బీమా, ఐపిపిబి వంటి పథకాలపై అవగాహన కల్పించాన్నరు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలనంటే ఖాతాలకు ఎన్పీసీఎల్ లింక్ చేసుకునేలా సిబ్బంది దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్వే మునీర్, స్టెనో వెంకటేష్, బీపీఎం భాగ్య శ్రీ పాల్గొన్నారు.



## నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

**నిర్మల్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ ఆర్టీసీ డిపోకు చెందిన సూపర్ లగ్జరి బస్సు హైదరాబాద్ నుండి నిర్మల్ వస్తుంది. నర్సాపూర్ (జి) చెందిన సత్తయ్య విలువైన సెల్ ఫోన్ పోగొట్టుకుని బస్ దిగిపోయాడు. బస్సు డిపోకు చేరుకోగానే బస్ చెక్ చేయగా అందులో సెల్ ఫోన్ లభ్యమయింది. సెల్ ఫోన్ ఆధారంగా సదరు ప్రయాణికుడిని పిలిపించి సెక్యూరిటీ విజలెన్స్ అధికారి విగ్నేష్ రెడ్డి, ఆన్ డ్యూటీ కంట్రోలర్ జిఆర్ రెడ్డి సమక్షంలో ఫోన్ అందజేశారు. నిజాయితీగా సెల్ ఫోన్ అప్పగించిన డ్రైవర్ నందిపేట సుమన్‌ను డిపోమేనేజర్ పండరి అభినందించారు.



## మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

**ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య.. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ గ్రామంలో జరిగింది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హర్కాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ వెంకటేష్ (39) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత నాలుగు సంవత్సరాల నుండి మద్యానికి బానిసై ఎలాంటి పనులు చేయకుండా మద్యం తాగుతూ ఉండేవారు. దీంతో భార్య జాదవ్ సంగీత తేదీ 05/02/2026 రోజున తాగి వచ్చిన భర్తను మందలించింది. అయితే మద్యం తాగిన మైకంలో వ్యవసాయ పొలంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా.. హుటాహుటిన ఆదిలాబాద్ రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి



తరలించారు. ఈ క్రమంలో ఆయన చికిత్స పొందుతూ.. మంగళవారం మరణించారు. మృతునికి భార్య జాదవ్ సంగీత, ఒక కుమారుడు జాదవ్ సాయికుమార్, కూతురు జాదవ్ కృష్ణవేణి ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## గూడెం వాగులో భారీగా ఇసుక తరలింపు

### అడ్డుకున్న ట్రాక్టర్ యూనియన్ నాయకులు

**కాసిపేట, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం సోమగూడెం వాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను కాసిపేట మండల ట్రాక్టర్ యూనియన్ నాయకులు అడ్డుకున్నారు. వాగులో భారీగా ట్రాక్టర్లను పెట్టి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అడ్డుకున్నారు. ఇసుక బుకింగ్ విధానం ఉండగా అక్రమ ఇసుక తరలింపు సరైంది కాదని మండిపడ్డారు. ఇసుక బుకింగ్ ద్వారా తరలించాలని నిబంధనలు ఉన్నా ఇలా త్వరగా ఇసుక పొందాలని, అధికంగా డబ్బు సంపాదించాలని అక్రమంగా తరలించడం ఏంటని ప్రశ్నించారు. దీని ద్వారా త్వరగా ఇసుక పొందెందుకు అక్రమార్కులు ఆసరా చేసుకుని అధిక రెట్లకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని మండిపడ్డారు. ఆన్ లైన్ బుకింగ్ ఆలస్యం కావడంతో అక్రమార్కులు ఇసుక త్వరగా తెస్తుండడంతో దీని ద్వారా నిజాయితీగా ఇసుక తరలించే వారు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ట్రాక్టర్లలో నింపిన ఇసుకను పడేసి వెళ్లిపోయారు. ఈ మేరకు ట్రాక్టర్ల యాజమానుల మధ్య కాసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. ఇదిలా ఉండగా అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డును పక్కనే రోజు వారీగా అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. అధికారులు అడ్డుకోవాల్సిన పనిని వారు పట్టించుకోకపోవడం వల్ల ట్రాక్టర్ యూనియన్ నాయకులు అడ్డుకోవాల్సిన పరిస్థితి నెలకొందనే విమర్శలు ఉన్నాయి. అధికారులు అక్రమార్కుల నుంచి మామూళ్లు తీసుకొని పట్టించుకోవడం లేదనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా కొంత మంది అధికారులకు సమాచారం ఇచ్చినా అక్రమార్కులకు ముందుగానే సమాచారం ఇచ్చి లాలూచి పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారి వద్ద నుంచి గుడ్ విల్ కింద దండుకుంటున్నారే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషమంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని అక్రమ ఇసుక తరలింపు అడ్డుకట్ట వేయాలని, వాగులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

## రెండు గంటల్లో దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

**జైనథ్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
మండలంలో జరిగిన ఇంటి దొంగతనం కేసును జైనథ్ పోలీసులు రెండు గంటల వ్యవధిలోనే చేధించారు. మద్యానికి బానిసై సొంత గ్రామంలోనే దొంగతనానికి పాల్పడిన నిందితున్ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి మంగళవారం మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. సాత్నాల మండలం కెనాల్ మేడిగూడ గ్రామానికి చెందిన నిందితుడు గుమ్మడి రవీందర్ (32) కూలి పనిచేస్తూ జీవనం సాగుతున్నాడు. మద్యానికి బానిసైన సదరు నిందితుడు ఖర్చుల కోసం డబ్బులు అవసరమై అదే గ్రామంలో నివసించే బరపటి వెంకటి ఇంటిని లక్ష్యంగా చేసుకున్నాడు. ఎవరు లేని సమయంలో నిందితుడు ఇంటిలోకి చొరబడి బీరువా తాళం తీసి అందులో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను దొంగలించి తన ఇంటి వద్ద మట్టిలో దాచిపెట్టాడు. దొంగతనం విషయం వెలుగులోకి రావడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, రంగంలోకి దిగిన జైనథ్ పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టి అనుమానాస్పదంగా ప్రవర్తిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. దొంగతనం చేసినట్లు విచారణలో తేలినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. అనంతరం అతని ఇంటి సమీపంలో మట్టిలో దాచిన ఆభరణాల డబ్బాను వెలికితీసి తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అతనివద్ద నుండి సుమారు 3తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి, 8తులాల రాగి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.5,04,500 ఉంటుందన్నారు. కేసు ఛేదనలో కీలకపాత్ర పోషించిన జైనథ్ సిఐ జి.శ్రావణ్‌తో పాటు ఆయన సిబ్బందిని జిల్లా ఎస్పీ



అఖిల్ మహాజన్, డీఎస్పీ జీవన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



# బెల్లంపల్లి పుర పోరుకు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది
- బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఏర్పాట్లు పూర్తి
- సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ
- బస్సుల్లో పీఎస్‌లకు చేరిన సిబ్బంది
- పోలీసు విధులపై ఏసీపీ రవికుమార్ మార్గదర్శకం



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)** బెల్లంపల్లి పుర పోరుకు సర్వం సిద్ధం చేశారు. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం అవుతుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు పోలింగ్ కు సంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. 34 వార్డులకు గాను 44,575 ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజల సౌకర్యార్థం 68 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం 340 పోలింగ్ సిబ్బంది. 200 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని అందజేశారు. పట్టణంలోని బజార్ ఏరియా ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటరు లోఎన్నికల సాంగ్రిని పంపిణీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లోలకు పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామగ్రితో తరలి వెళ్లారు. మునిసిపల్ ఎన్నికల్లో నిర్వహణ ఏర్పాట్లను బెల్లంపల్లి మునిసిపల్ ఎన్నికల అధికారి సంపత్ రెడ్డి పర్యవేక్షంలో ఎన్నికల సామాగ్రి, ఎన్నికల ఏర్పాట్లు జరిగాయి. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఎన్నికల పరిశీలకుడు గంగాధర్ సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. ఏ లోటు లేకుండా ఎన్నికల ఏర్పాట్లు ఉండాలని ఆర్ ఓ సంపత్ రెడ్డి ను ఆదేశించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ లో బెల్లంపల్లి మునిసిపల్ కమిషనర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంపత్ రెడ్డి, బెల్లంపల్లి తహసిల్దార్ లౌడియా కృష్ణ పాల్గొన్నారు. బెల్లంపల్లి ఏసీపీ ఎన్నికలను పురస్కరించుకొని డిస్ట్రిబ్యూషన్ సెంటరులో ఏర్పాటు చేసిన పోలీస్ రిసెప్షన్ సెంటర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల నిర్వహణలో పోలీసులు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. పోలీసు బందోబస్తు మధ్య. ఎన్నికల నిర్వహణకు అవసరమైన భద్రత చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలాచర్యలు తీసుకోవాలన్నారు. బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు, బెల్లంపల్లి, కన్నెపల్లి, మాదారం ఎస్ఐలు కిరణ్ కుమార్, భాస్కర్, ప్రసాద్, సౌజన్య, పోలీసు అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.



## సార్వత్రిక సమ్మె
# నోటీసులు అందజేత

**తాండూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొనాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగాం రాజారాం అన్నారు. మంగళవారం తాండూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యురాలు ఝాన్సీరాణి, ఎమ్మార్వో కార్యాలయంలో సిబ్బందికి సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులతో కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2025, వీబీజీ రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించుకోవాలన్నారు. అలాగే కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు పిలుపుమేరకు ఈ నెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం మొత్తం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉద్యోగ, కార్మిక సంఘాలు, ఉద్యోగులు, ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, ప్రజా సంఘాలు బీజేపీ మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ చట్టాలను రద్దు చేసేంతవరకు పోరాటా లలో భాగ్యసాములై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలి



## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

**మంచిర్యాల, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)** అధికార కాంగ్రెస్ పార్టీ ఇష్టారీతిన దౌర్జన్యం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కాల నీలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రజలకు చేసిందేమిలేదని పేర్కొన్నారు. అక్రమ మార్గంలో డబ్బులు పంపిణీ చేస్తూ ఓట్లు దండుకునేప్రయత్నం చేస్తుందని, ప్రజలు విజ్ఞులై ఓటుతోనే గుణపాఠం చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ మంచిర్యాలలో ఎమ్మెల్యే ప్రోద్భలంతో తమపార్టీకిచెందిన కార్పోరేటర్ అభ్యర్థులను ప్రచారం చేయకుండా ఇబ్బందులు పెట్టారన్నారు. ఈ సమావేశంలో నాయకులు విజిత్‌రావు, రవీందర్‌రెడ్డి, పల్లెభూమేష్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిరియాడిక్ దినోత్సవం



**నిర్మల్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ పీరియాడిక్ టేబుల్ దినోత్సవాన్ని మంగళవారం జరుపుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రసాయన శాస్త్ర విభాగం, విద్యార్థులు, అధ్యాపకుల చురుకైన భాగస్వామ్యంతో జాతీయ పీరియాడిక్ టేబుల్ దినోత్సవం-2026ను జరుపుకుంది. కార్యక్రమంలో భాగంగా, 1-118 మూలకాలు చూడకుండ చెప్పడం, పీరియాడిక్ టేబుల్ పోస్టర్ ప్రెజెంటేషన్ వంటి పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్ శ్రీ రంజిత్, జీవిత నైపుణ్యాల ప్రాముఖ్యతను తెలియ చేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధాకర్ మద్నూరే, విజేతలు మరియు పాల్గొన్న వారందరినీ అభినందించారు. ఈ కార్యక్రమాన్ని సనా గజాలతో పాటు కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె. సూర్య సాగర్, జి. అర్చన నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపక సభ్యులు చురుకుగా పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## తాటి చెట్టుపై నుండి పడి
# గీత కార్మికునికి గాయాలు

**ఖానాపూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)** ఖానాపూర్ మండలంలోని బాధనకుర్తి గ్రామానికి చెందిన పంతగి నారాయణ గౌడ్ అనే గీత కార్మికుడు తాటి చెట్టు పైనుండి పడి తీవ్రంగా గాయపడ్డ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలకై ప్రతి రోజు వృత్తి నిర్వహణలో భాగంగా మంగళవారం సాయంత్రం కల్లు తీసేందుకు తాటి చెట్టు పైకి ఎక్కిన ఆయన ప్రమాదావశత్తు తాడి చెట్టుపై నుండి కింద పడ్డాడు అని అక్కడ ఉన్న స్థానికులు తెలిపారు. నారాయణ గౌడ్ తాడి చెట్టు పై నుండి పడడంతో ఆయన తీవ్ర గాయాలు అయ్యాయని,వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు.

## మత విద్వేషాలు రెచ్చగొట్టేలా
# ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)** మతాలను అడ్డుగా పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందేలా, ఓటర్లను ప్రలోభ పెట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు, వాట్సాప్ స్టేటస్‌లు పెట్టి మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేసిన వ్యక్తిపై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ కె. నాగరాజు తెలిపారు. గతంలో రాజకీయ నాయకులు మాట్లాడిన వీడియోలను వినియోగిస్తూ వాట్సాప్‌లో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టి ఎన్నికల నియామ నిబంధనలను ఉల్లంఘించినందుకు సాయి తేజ ఏ చంటి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మతాలను అడ్డుగా పెట్టుకుని రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను ప్రేరేపించడం, ఓటర్లను ప్రలోభ పెట్టడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో అసత్య ప్రచారం, విద్వేషపూరిత పోస్టులు, ప్రేరేపించే వీడియోలు షేర్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు చేయవద్దని సూచించారు.

# బుగ్గ దేవాలయాన్ని తాండూర్ పరిధిలోకి తీసుకోవాలి



**తాండూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)** బుగ్గ దేవాలయ రికార్డులు తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోకి మార్చి దేవాలయాన్ని తాండూర్ మండల పరిధిలోకి తీసుకోవాలని మంచిర్యాల జిల్లా తాండూర్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తహసిల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్షలఘట్టం గ్రామ సమీపంలోని బుగ్గ దేవాలయం రికార్డులు మొత్తం తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ, తాండూర్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలో ఉన్నందున రికార్డుల ప్రకారం బుగ్గ దేవాలయం కూడా తాండూర్ పరిధిలోకి వస్తుందని తెలియజేశారు. కన్నాల పరిధిలో ఉన్న ఈ దేవాలయాన్ని అక్కడ రికార్డుల నుంచి తొలగించి తాండూర్ రెవెన్యూ రికార్డుల ప్రకారం తాండూర్ పరిధిలోకి తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు, దత్తాత్రేయరావు, మాసాడి శ్రీరాములు, బోనగిరి చంద్రశేఖర్, రామచందర్, భీమ లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

## మంచిర్యాల ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.గంగాధర్, జిల్లా విద్యాధికారి యాదయ్య లతో కలిసి కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ కొరకు అదనపు సిబ్బందితో కలిపి 66 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 132 మంది కౌంటింగ్ సహాయకులు, బెల్లంపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 19 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 37 మంది కౌంటింగ్ సహాయకులు, చెన్నూరు మున్సిపాలిటీకి అదనపు




సిబ్బందితో కలిపి 10 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 20 మంది కౌంటింగ్ సహాయకులు,, క్యాతనపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 24 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 48 మంది కౌంటింగ్ సహాయకులు, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 9 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 18 మంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 12వ తేదీన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయించిన కౌంటింగ్ సిబ్బంది సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో, బెల్లంపల్లి, క్యాతనపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీలకు కేటాయించిన కౌంటింగ్ సిబ్బంది ఆయా మున్సిపల్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని, ఈ నెల 13వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్, ఆయా మున్సిపాలిటీలకు సంబంధించి ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు సకాలంలో హాజరై విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# రెండేళ్ల పాపను తల్లి ఒడికి చేర్చిన పోలీసులు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఈ నెల 4వ తేదీన రెండేళ్ల చిన్నారి ఒంటరిగా ఏడుస్తూ కనిపించగా, అప్రమత్తమైన సెక్యూరిటీ గార్డు అమీర్ వెంటనే గుర్తించి అవుట్‌పోస్ట్ పోలీసులు రవీందర్ రెడ్డి, అబీదుల్లా హుసేన్, ఐటీడీఏ హెల్ప్ డెస్క్ ఉద్యోగి బలిరాం వారికి సమాచారం అందించారు. వారు పాపను సురక్షితంగా సంరక్షణలోకి తీసుకున్నారు. నర్సింగ్ అధికారులు అరుణ, ఉజ్వల రాత్రి సమయంలో చిన్నారికి అవసరమైన సపర్యలు అందించారు. సమాచారం అందుకున్న డీసీపీవో రాజేంద్ర ప్రసాద్, ష్యూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది రిమ్స్‌కు చేరుకుని వివరాలు సేకరించి, పాపను శిశుగృహానికి తరలించారు. ఇదే సమయంలో మహారాష్ట్రలోని మాండ్వి ప్రాంతానికి చెందిన తల్లి భారతి తన కుమార్తె అకీరాను వెతుకుతూ ఆదిలాబాద్‌కు చేరుకొని సమాచారం కోసం ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న డీసీపీవో సిబ్బంది ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ నాగరాజు విచారణ చేపట్టి శిశుగృహంలో ఉన్న పాపనే తల్లి వెతుకుతున్న చిన్నారి అని నిర్ధారించారు. అనంతరం గురువారం శిశుగృహ మేనేజర్ విజయలక్ష్మి, ష్యూర్ ఎన్జీవో కోఆర్డినేటర్ వినోద్ సమక్షంలో పాపను తల్లి భారతికి అప్పగించారు. పోలీసులు, రిమ్స్ సిబ్బంది, డీసీపీవో, ష్యూర్ ఎన్జీవో ప్రతినిధుల సమన్వయంతో తల్లి–పాపలు కలుసుకోవడం పట్ల తల్లి భారతి హర్షం వ్యక్తం చేస్తూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# సేవాలాల్ జయంతి ఉత్సవ నూతన కమిటీ ఎన్నిక

**జన్నారం, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
సంత్ సేవాలాల్ ఉత్సవ మండల నూతన కమిటీని సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా లాకావత్ నందు నాయక్, కార్యదర్శిగా భూక్యా సదా సింగ్ ఉపాధ్యక్షులుగా బోడ రవి నాయక్, భూక్య సంతోష్ నాయక్,సంయుక్త కార్యదర్శులుగా జాదవ్ సుదాం నాయక్,జర్పుల ధర్మ నాయక్, సాంస్కృతిక కార్యదర్శిగా లావుడ్య రమేష్,కోశాధికారి గా నూనావత్ భగవాన్ దాస్, సలహాదారులుగా పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షుడు లాకావత్ నందు నాయక మాట్లాడుతూ ఈనెల 17న నిర్వహించే 278వ సంత సేవాలాల్ జయంతి ఉత్సవాలను అందరి



సహకారంతో ఘనంగా నిర్వహిస్తామని, దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

# ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థిని మృతి

**ఉట్నూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
నీటి కోసం వెళ్లిన ఇంటర్ విద్యార్థిని ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని హస్నాపూర్‌లో చోటు చేసుకుంది. ఏఎస్సై రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హస్నాపూర్ గ్రామానికి చెందిన మోహన్ కుమార్తె సోనీ (17) నార్నూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. విద్యార్థినికి గత ఆరు నెలల నుండి తలనొప్పి, తల తిరగడం వంటి వ్యాధితో ఇబ్బంది పడుతుంది. ఆస్పత్రులకు తిరిగిన నయం కాలేదు.



అనారోగ్య కారణంగా సోనీ ఇంటి వద్దనే ఉంటుంది. రోజు యథావిధిగా ఇంటికి అవసరం నీటిని ఇంటికి సమీపంలో ఉన్న బావి నుండి నీటిని తీసుకవచ్చేది. మంగళవారం తెల్లవారుజామున నీటి కోసం బావి వద్దకు వెళ్లిన సోనీ చాలాసేపటికైన ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు గమనించి బావి వద్దకు వెళ్లగా.. అక్కడ బావిలో పడి ఉండవచ్చని అనుమానంతో వెతకగా శవమై కనిపించిది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సోనీ నీటిని చేదే సమయంలో ప్రమాదవశాత్తు బావిలో పడ్డట్లు మృతురాలి తల్లి మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రామయ్య తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా, ఓటు హక్కు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు కలెక్టర్ హరిత ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేశారు. అర్హత గల ఉద్యోగులు పోలింగ్ రోజున ఈ సెలవును ఉపయోగించుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె సూచించారు.



# ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి

## మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్

**మంచిర్యాల, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ రోజున అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోసం నోటిఫై చేయబడిన ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, దుకాణాలు, కర్మాగారాలకు పోలింగ్ రోజున ఆయా సంస్థలలో పని చేసే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా వేతనంతో కూడిన సెలవు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, కౌంటింగ్ రోజున వినియోగించే ప్రభుత్వ భవనాల విద్యా సంస్థలకు పోలింగ్ నిర్వహణ కోసం స్థానిక సెలవులు ఉపయోగించబడతాయని తెలిపారు.

# దేశీదారు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**నేరడిగొండ, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
దేశీదారులను విక్రస్తున్న రాజుల తాండ గ్రామానికి చెందిన సాబ్లే విజ్ఞాన్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. మహారాష్ట్ర నుంచి దేశీదారును తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా నిందితుని వద్ద 115, 90 ఎంఎల్ బాటిల్స్ పట్టుబడ్డాయని, నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జుల్ఫికర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా గంజాయి, బెల్లం, పటిక, దేశీదారు, గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దాడులలో శిక్షణ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది కార్తీక్, మొహమ్మద్, అరుణ, మంజుల, ఉన్నారు.



# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



**బెజ్జూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండలంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సందర్శించారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న పని ప్రదేశాలను సందర్శించి, కూలీల హాజరు పరిశీలించారు. కూలీలకు ప్రతి పనిని తగిన నిర్దేశిత కొలతలతో చేసి ప్రతి రోజు పూర్తి వేతనం రూపాయలు 307 పొందాలని ప్రతి జాబ్ కార్డు 100 రోజులు పనిదినాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో రాజన్న, ఈసీ మురళి, టిఏ విజయ్, గ్రామ కార్యదర్శి వైకుంఠం పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికలలో భాగంగా బుధవారం పోలింగ్ నేపథ్యంలో సమర్థవంతమైన ప్రక్రియ నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కె హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలలో వార్డుల పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు, పోలింగ్ సిబ్బంది ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి విధులు నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నామని చెప్పారు. జిల్లాలోని మున్సిపాలిటీలో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్‌రాజు తదితరులు ఉన్నారు.రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం పోలింగ్ ప్రక్రియలో మున్సిపల్ పరిధిలో ఓటు హక్కు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల ఉద్యోగులు పోలింగ్ రోజుల ప్రత్యేక సాధారణ సెలవు సద్వినియోగం చేసుకుని ఓటు హక్కు



వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలలో బుధవారం నిర్వ హించే మున్సిపల్ పోరుకు అదికారులు అన్ని ఏర్పా ట్లు పూర్తి చేశారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉండగా 28 పోలింగ్ బూత్‌లను అదికారులు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళా శాలలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని డీఏవీ పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో బయలుదేరి వెళ్లారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులు 85 పోలింగ్ బూతులను ఏర్పాటు చేశారు. మొత్తం 50 వార్డు కౌన్సిలర్ స్థానాలకు పోలింగ్ నిర్వహించడానికి అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆసిఫాబాద్ పరిధిలో 13,927 మంది, కాగజ్‌నగర్ పరిధిలో 51,205 మంది ఓటర్లు ఉండగా జిల్లాలో రెండు మున్సిపాలిటీలలో 65,132 మంది ఓటర్లు ఉన్నారు.



## మున్సిపల్ ఎన్నికలు

# ప్రశాంతంగా నిర్వహించాలి

### కుమ్రంభీం ఆసిఫాబద్ ఎస్పీ నితికా పంత్

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పూర్తి నిబద్ధతతో క్రమశిక్షణగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలోని బిఎంఎస్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఎన్నికల విధులపై పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, సున్నిత పోలింగ్ కేంద్రాల్లో అదనపు బలగాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 163 దీఛీూా అమలులో ఉన్నందున నలుగురికి మించి గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు భయభ్రాంతులు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ నితికా పంత్ ఆదేశించారు.

# బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

**బెజ్జూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలైన సంఘటన బెజ్జూర్ మండలం రెబ్బెన గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బెజ్జూర్ మండలం రెబ్బన గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి బెజ్జూర్ గ్రామానికి చెందిన మేకల గొంతు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన మేకల గొంతును 108 కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

# గ్రామ సమస్యలపై దృష్టి సారించాలి

**సిర్పూర్ (టి), ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామ పంచాయతీల్లో సమస్యలు గుర్తించి పరిష్కరించాలని డీఎల్‌పీవో హరిప్రసాద్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లకు గ్రామాభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో ఉన్న సమస్యలను సర్పంచ్‌లు తెలుసుకుని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ప్రత్యేకంగా రానున్న వేసవి కాలంలో నీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మేలు చేకూరేలా చూడాలన్నారు. తహసీల్దార్ రహీముద్దీన్ మాట్లాడుతూ మండలంలో 8,643 మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. వారికి ప్రతి నెలా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.



ఏపీఎం మహేష్ మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ పంచాయతీలో ఈజీఎస్‌లో వీవో భవనాల కోసం ఒక్కో దానికి రూ.10 లక్షలు మంజూరు అయ్యాయని చెప్పారు. గోదాం నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు అయ్యాయని వివరించారు. త్వరలోనే సర్పంచ్‌ల తీర్మానాల ప్రకారం పనులను ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపీవో వినోద్ కుమార్, ఏఈలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**రెబ్బెన, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

సింగరేణిలో గురువారం నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రీజియన్ ప్రసిడెంట్ ఉపేందర్ పిలుపునిచ్చారు. స్థానికంగా మంగళవారం సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, కుమార్, సత్యనారాయణ తదితరులు



పాల్గొన్నా రు. ఏఐటీయూఐసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వ ర్యంలో సీహెచ్‌పీ, ఇతర కార్యాలయ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు తిరుపతి, మొగిలి, రాజేష్, శ్రీనివాస్, రామయ్య, శ్రీను, శ్రీనివాస్, శ్రీకాంత్, ఆర్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగ సంఘాల నాయకులు డాక్టర్ రశికకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రమీల, సునీత, వనిత, తులసీ, విజయలక్ష్మి, సరిత, రేణుక, సుప్రియ, మీనా పాల్గొన్నారు.



## తమ్ముడిని కాపాడబోయి..

# అన్నదమ్ములు మృతి

**ఉట్నూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

ఓ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. తమ్ముడిని కాపాడబోయే తరుణంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందిన ఘటన మంగళవారం ఉట్నూర్ మండలంలోని ఉమ్రి కోలాంగూడ గ్రామంలో జరిగింది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొలంగూడకు చెందిన ఆత్రం సోనేరావ్‌కి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఆత్రం జంగు (29), ఆత్రం లేతు (27), ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. లేతుకి గత 8నెలల నుండి మతిస్థిమితం సక్రమంగా లేదు. మంగళవారం శ్యాంపూర్ బుడుందేవ్ జాతరకు వెళ్లారు. అక్కడే ఇద్దరు మద్యం తాగారు. మద్యం మత్తులో నేను చస్తానని లేతు గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో దూకాడు. తమ్ముడిని ఎలాగైనా కాపాడాలని వెంటనే అన్న జంగు సైతం బావిలోకి దూకాడు. ఏమైందో ఏమో తెలియదు ఇద్దరు అన్నదమ్ములు ఆ బావిలో శవమై తేలారు. అటుగా వెళ్ళిన మృతుల తండ్రి సోనేరావ్ బావి వద్దకు వెళ్లి చూడగా.. కేకలు వేస్తూ కుటుంబ సభ్యులను, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్సై విజయ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరి శవాలను ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## పోలింగ్ కేంద్ర్రాలకు

# చేరిన ఎన్నికల సిబ్బంది

**నిర్మల్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని 42 వార్డులో బుధవారం నిర్వహించి ఎన్నికల పోలింగ్కు ఎన్నికల సిబ్బంది మంగళవారం చేరుకున్నారు. ఎన్నికల పోలింగ్ సామాగ్రి తో తరలి వెల్లిన సిబ్బంది ఎన్నికల పోలింగ్కు కావలసిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు పోలింగ్ సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు.




# జిల్లా స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపిక

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**


ఈనెల 13వ తేదీన మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో బెల్లంపల్లికి చెందిన తమ విద్యార్థులు ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ కోచ్ సల్పల సంతోష్ తెలిపారు దీక్ష, సాయి యశ్వంత్, సహస్య, గౌసుద్దీన్, సహస్ర, విష్ణువర్ధన్ ఈనెల 6వ తేదీన బెల్లంపల్లి జనరల్ వెల్ఫేర్ కాలేజీ క్రీడా మైదానంలో జరిగిన సీఎం కప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. తమ అసోసియేషన్ క్రీడలకు పెద్దపీట వేస్తుందని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# దసరా కాంబో రిపీట్



ఈ వేసవిలోనే విడుదలయ్యేందుకు సిద్ధమవుతున్న చిత్రాల్లో 'ది ప్యారడైజ్' ఒకటి. ప్రస్తుతం పరిచయ గీతం చిత్రీకరణ జరుగుతోంది. ఆయా షేర్... అంటూ సాగే ఈ పాటని నానితోపాటు, వందలామంది డ్యాన్సర్ల నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. నాని కథానాయకుడిగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ఎస్.ఎల్.వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. విజయవంతమైన 'దసరా' తర్వాత అదే కలయికలో రూపొందుతున్న చిత్రమిది. మోహన్‌బాబు ముఖ్యభూమిక పోషిస్తున్నారు. హైదరాబాద్‌లో తీర్చిదిద్దిన ప్రత్యేకమైన సెట్‌లో ప్రస్తుతం పాటని తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ స్వరపరిచిన ఈ పాటని, సుధన్ నృత్య దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రంలో నాని కనిపించే విధానం ఎంతో ప్రత్యేకంగా ఉంటుందని, పరిచయ గీతం సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చిత్రవర్గాలు తెలిపాయి. రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సీహెచ్ సాయి, కూర్పు: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా.





# కిరణ్ అబ్బవరం నెక్స్ట్ లెవల్..

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం మరో భారీ ప్రాజెక్ట్‌తో ముందుకు వస్తున్నారు. జీ స్టూడియోస్, నిర్మాత ప్రేరణ అరోరా కలిసి నిర్మిస్తున్న కొత్త పాన్ ఇండియా సినిమాలో కిరణ్ అబ్బవరం హీరోగా నటించనున్నారు. టైటిల్ ఇంకా ఖరారు కాకపోయినా, ఈ సినిమా ఇప్పటికే టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లో కూడా హాట్ టాపిక్‌గా మారింది.ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సల్, ప్రేరణ అరోరా కలిసి భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. కీర్తన్ ఈ ప్రాజెక్ట్‌కు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. యాక్షన్, అడ్వెంచర్, డ్రామా ప్రధానంగా రూపొందుతున్న ఈ సినిమాను అన్ని భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.కిరణ్ అబ్బవరం కెరీర్‌లో ఇది ఒక పెద్ద అడుగు అని చెప్పొచ్చు. ఇప్పటివరకు సహజ నటనతో ప్రేక్షకుల మెప్పు పొందిన కిరణ్, ఈ సినిమాలో పూర్తిగా కొత్త లుక్, పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించనున్నారు. బిగ్ స్క్రీన్ పై భారీ కథతో ఆయనను చూపించేందుకు మేకర్స్ ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నారు.ఈ ప్రాజెక్ట్‌తో జీ స్టూడియోస్, ప్రేరణ అరోరాల మధ్య ఉన్న క్రియేటివ్ బాండ్ మరింత బలపడింది. గతంలో వీరిద్దరూ కలిసి 'రుస్తమ్' వంటి హిట్ సినిమాలు అందించారు. ఇటీవల హిందీ-తెలుగు బైలింగ్వల్ ప్రాజెక్ట్‌తో కూడా మంచి ఫలితం సాధించారు. ఇప్పుడు ఈ సినిమాతో మరింత పెద్ద లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు.ఈ సినిమా యాక్షన్ అడ్వెంచర్ కథతో పాటు భారతీయ సంస్కృతి, భావోద్వేగాలు, మైథాలజీ టచ్ తో రూపొందనుందని సమాచారం. భారీ విజువల్స్, గ్రాండ్ వరల్డ్ బిల్డింగ్, హై టెక్నికల్ వాల్యూస్‌తో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి.సెప్టెంబర్‌లో షూటింగ్ ప్రారంభం కానుండగా, హీరోయిన్ కోసం టాలీవుడ్, బాలీవుడ్ నటీమణుల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. దర్శకుడు, ఇతర నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.మొత్తానికి, పెద్ద నిర్మాణ సంస్థ, అనుభవజ్ఞులైన నిర్మాతలు, పాన్ ఇండియా స్థాయిలో కథతో కిరణ్ అబ్బవరం నటిస్తున్న ఈ సినిమా ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా మారనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# మిల్కీ బ్యూటీ.. బిగ్ హార్ట్!

సినిమా కళాత్మక వ్యాపారం. ఇక్కడ తారలు తమ ఇమేజ్‌ను బట్టి పారితోషికాల్ని డిమాండ్ చేస్తుంటారు. ఇక అగ్ర తారలైతే రెమ్యునరేషన్ విషయంలో ఏమాత్రం రాజీపడరు. కానీ ఈ ధోరణికి భిన్నంగా అగ్ర కథానాయిక తమన్నా 'ఓ రోమియో' అనే హిందీ సినిమాలో అతిథి పాత్రలో నటించినందుకుగాను ఎలాంటి పారితోషికాన్ని తీసుకోలేదట. ప్రస్తుతం ఈ విషయం బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. షాహిద్‌కపూర్, త్రిప్తి డిమ్రి జంటగా నటించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రచార కార్యక్రమాల సందర్భంగా దర్శకుడు విశాల్ భరద్వాజ్ రెమ్యునరేషన్ల అంశం గురించి మాట్లాడారు.కథానాయిక తమన్నా, '12th ఫెయిల్' ఫేమ్ విక్రాంత్ మస్సే ఈ సినిమాలో అతిథి పాత్రల్లో నటించారని, తనతో ఉన్న స్నేహసంబంధాలతో పాటు ఓ మంచి కథకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో వారిద్దరూ పైసా పారితోషికాన్ని తీసుకోకుండానే నటించారని, ఈ రోజుల్లో అంతటి ఉదార స్వభావం ఉన్నవారు అరుదని ప్రశంసించారు. గెస్ట్‌రోల్ కోసం కొన్ని రోజులే కేటాయించినా.. ఇప్పుడున్న వ్యాపార దృక్కోణంలో ఉచితంగా నటించడం గొప్ప విషయమని బాలీవుడ్ వర్గాలంటున్నాయి. గత ఏడాది వచ్చిన 'ఓదెల-2' తర్వాత తెలుగులో తమన్నా మరే చిత్రానికి సైన్ చేయలేదు.





# మున్సిపల్ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

**నిర్లక్ష్యంపై కఠిన చర్యలు - బ్యాలెట్ బాక్సులు, కిట్‌లు క్షుణ్ణంగా పరిశీలించాలి - పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు**

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ - బైంసాలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల తనిఖీ**





**నిర్మల్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మంగళవారం బైంసాలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) రిసెప్షన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి అధికారి తన బాధ్యతను కచ్చితంగా నిర్వర్తించాలని అన్నారు. పోలింగ్ సామగ్రి స్వీకరణ సమయంలో బ్యాలెట్ బాక్సులు, పేపర్ సీల్స్, స్టేషనరీ కిట్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఏవైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన వాహనాల్లోనే నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దశలో చెక్‌లిస్టులను అనుసరిస్తూ క్రమబద్ధంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జనరల్ అబ్జర్వర్ వీరా రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓటర్లు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సిబ్బంది సహకరించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ మాట్లాడుతూ, పోలింగ్ ముగిసిన తర్వాత డైరీలు, రిజిస్టర్లు, సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం రిసెప్షన్ కౌంటర్లలో అప్పగించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉన్నాయని చెప్పారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. అనంతరం రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు వాహనాలలో వెళ్తున్న అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.















# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

## మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన పోలింగ్ నిర్వహణకు జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు గాను 265 పోలింగ్ కేంద్రాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 68 పోలింగ్ కేంద్రాలు, చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులకుగాను 36 పోలింగ్ కేంద్రాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులకు 45 పోలింగ్ కేంద్రాలు, లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఒక బృందానికి 1 పి.ఓ., 1 ఎ.పి.ఓ., 3ఓ.పి.ఓ.ల చొప్పున రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా అధికారుల బృందాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేలా పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల



ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీ శాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్ లో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు జోనల్, నోడల్ అధికారులు, పి.ఓ.లు, ఎ.పి.ఓ.లు, ఓ.పి.ఓ.లు, వీడియో, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెల్, ఇతర ఎన్నికల సంబంధిత సిబ్బందిని నియమించి, అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థుల తరపున నియమించబడిన పూర్తి స్థాయి ఏజెంట్ల సమన్వయంతో తప్పుడు ఓట్ల పోలింగ్ ను నివారించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ రోజున వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నీడ ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ సమన్వయంతో భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని, పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల నిబంధన అమలులో ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉండే అభ్యర్థులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలు లభించినట్లయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# చికిత్స పొందుతూ మామా అల్లుళ్లు మృతి

**బెజ్జూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం ఏటిగూడెం గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడగా, ఇద్దరు చికిత్స పొందుతూ.. మంగళవారం మృతి చెందినట్లు బెజ్జూర్ ఎస్సై సర్దాజ్ పాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూరు మండలం ఏటిగూడ గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో కౌటాల మండలం గురుడుపేట గ్రామానికి చెందిన నగోషామండయ్య, బోధశీ పెల్లి గ్రామానికి చెందిన



ఆదే అభిరామ్, వాడయి. మోహన్లు గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను కాగజ్నగర్ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదే అభిరామ్ (6) బాలుడు సోమవారం చికిత్స పొందు మృతిచెందగా, నగోష మొండయ్య (17) యువకుడు మంగళవారం మృతి చెందారు. వడయి మోహన్ చికిత్స పొందుతున్నారు. నగోష ముండయ్యకు, ఆదే అభిరామ్ మామ, అల్లుడు ఏటిగూడెం గ్రామానికి వాడే బాపు ఇంటికి పోచమ్మ కోసం బంధువుల ఇంటికి రాగా.. బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదం జరిగింది. అభిరామ్ తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సర్దాజ్ పాషా తెలిపారు.



# సమ్మెకు దూరంగా ఉండాలి

## మందమర్రి జీఎం రాధాకృష్ణ

**మందమర్రి, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

సింగరేణి సంస్థ ప్రయోజనాల ను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 12న జరిగే సమ్మెకు కార్మికులు దూరంగా ఉండాలని, కార్మిక సంఘాలు కూడా సహకరించాలని మందమర్రి జీఎం రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక జీఎం కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మందమర్రిఏ రియా పరిస్థితి బాగా లేదన్నారు. ఈసమ్మె వల్ల ఉత్పత్తి రూపేణా రూ. 70 కోట్లు, వేతనాల రూపంలో రూ. 12 కోట్లు నష్టపోవాల్సి ఉంటుంది. సమావేశంలో ఏఐ టీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఎస్‌వోటూ జీఎం ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, ఐఎన్‌టీ యూసీబ్రాంచ్ సెక్రటరీ దేవి భూమయ్య పాల్గొన్నారు. ఫసంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఉద్యోగులకు క్యాంటీన్‌లో మంచి రు చికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని జీఎం రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం ఏరియాలోని కేకే ఓసీపీలో ఉద్యోగులకు లంచ్‌బ్రేక్ ప్రారంభానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా క్యాంటీన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.

# బెజ్జూర్ సీఎస్సీని తనిఖీ

**బెజ్జూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

బెజ్జూర్ సీఎస్సీని తనిఖీ చేసిన డీసీహెచ్ఎస్.. బెజ్జూరు మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ను మంగళవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కమ్యూనిటీ హెల్త్ సూపర్డెంట్ డాక్టర్ అవినాష్ కుమార్ తనిఖీ చేశారు. సీఎస్సీ సెంటర్‌లోని రిజిస్టర్లను పరిశీలించారు. మందులను పరిశీలించారు. వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే పని చేయాలని ఆదేశించారు.



# ఆసిఫాబాద్‌లో మున్సిపల్ పోలింగ్‌కు సర్వం సిద్ధం

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలలో బుధవారం నిర్వ హించే మున్సిపల్ పోరుకు అదికారులు అన్ని ఏర్పా ట్లు పూర్తి చేశారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉండగా 28 పోలింగ్ బూత్ లను అదికారులు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళా శాలలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని డీఏవీ పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో బయలుదేరి వెళ్లారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులు 85 పోలింగ్ బూతులను ఏర్పాటు చేశారు. మొత్తం 50 వార్డు కౌన్సిలర్ స్థానాలకు పోలింగ్ నిర్వహించడానికి అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆసిఫాబాద్ పరిధిలో 13,927 మంది, కాగజ్‌నగర్ పరిధిలో 51,205 మంది ఓటర్లు ఉండగా జిల్లాలో రెండు మున్సిపాలిటీలలో 65,132 మంది పట్టణ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారు.

**బరిలో 224 మంది అభ్యర్థులు...**

జిల్లాలో ఆసిపాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 50 వార్డులలో మొత్తం 224 మంది అభ్యర్థులు బరిలో నిలిచి తమ ఆదృష్టాన్ని పరిక్షించుకోనున్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులలో మొత్తం 94 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 19 మంది, బీఆర్ఎస్ నుంచి 20 మంది, బీజేపీ నుంచి 18 మంది, బీఎస్పీ నుంచి ముగ్గురు, సీపీఐ నుంచి ముగ్గురు, సీపీఎం నుంచి ఒకరు, జనసేన నుంచి ఎనిమిది, స్వతంత్రులు 22 మంది బరిలో ఉన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులలో మొత్తం 130 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 29 మంది, బీఆర్ఎస్ నుంచి 30 మంది, బీజేపీ నుంచి 30 మంది, బీఎస్పీ నుంచి ఎనిమిది, సీపీఐ(ఎం) నుంచి ఇద్దరు, ఎంఐఎం నుంచి ముగ్గురు, జనసేన నుంచి ఇద్దరు, ఇతర పార్టీల నుంచి ముగ్గురు, స్వతంత్రులు 23 మంది పోటీలో నిలిచారు.

**500 మంది సిబ్బంది...**

జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం మొత్తం 500 మంది ఎన్నికల సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 28 పోలింగ్ కేంద్రాలు ఉండగా రిజర్వు సిబ్బందితో కలుపుకొని 39 మంది పీవోలు, 41 మంది ఏపీవోలు, 80 మంది ఓపీవోలు ఎన్నికల విధులకు కేటాయించారు. అలాగే కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 85 పోలింగ్ కేంద్రాలకు 85 మంది పీవోలు, 85 ఏపీవోలు, 170 మంది ఓపీవోలు మొత్తం 340 మంది సిబ్బందిని ఎన్నికల నిర్వహణకు నియమిం చారు. జరిగింది. కాగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలోని ఆసిఫాబాద్, కాగ జ్‌నగర్ మున్సిపాలిటీలలో జరిగే ఎన్నికల సంద ర్భంగా 800 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు లో పాల్గొననున్నారు. ఇందులో డీఎస్పీ స్థాయి అధికారులు నలుగురు, సీఐలు,ఆర్ఐలు 12 మంది, ఎస్సైలు, ఆర్ఎస్సైలు 38 మంది, స్పెషల్ పార్టీ పోలీసులు 120 మంది, ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌లు 516 మంది, హోంగార్డులు 75 మంది, అటవి, ఫైర్ ఇతర శాఖల సిబ్బంది 47 మంది బందోబస్తులో పాల్గొననున్నారు.

**జిల్లాలో 65,132 మంది ఓటర్లు...**

జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలి టీల పరిధిలో 65,132 మంది ఓటర్లు ఉన్నారు. ఆసిఫాబాద్



మున్సిపాలిటీలో మొత్తం 13,927 మంది ఓటర్లు ఉండగా ఇందులో 6822 మంది పురుషులు, 7103 మంది మహిళలు ఇద్దరు ఇతరులు ఉన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధి లో మొత్తం 51,205 మంది ఓటర్లు ఉండగా ఇందు లో 25,004 మంది పురుషులు, 26,193 మంది మహిళలు, ఎనిమిది మంది ఇతరులు ఉన్నారు.

**యంత్రాంగం విస్తృత చర్యలు...**

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో జరుగనున్న ఎన్నికలకు అధికారులకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. 30 వార్డుల్లో ఎన్నికలు ప్రశాతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం విస్తృత చర్యలు చేపట్టింది. అదనపు కలెక్టర్ డేవిడ్ ఎన్నికల సిబ్బందికి విధులను కేటాయించి రూట్ మ్యాప్‌లను అందజేశారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రితో పాటు 85 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది మంగళవారం ఉదయం బయలు దేరారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద మౌలిక వసతులు, బ్యారికేడ్లు ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టారు. ప్రత్యేక బలగాలతో పాటు స్థానిక పోలీసులను కూడా మోహరించారు. ఎన్నికల కోడ్‌ను కఠినంగా అమలు చేస్తున్నామని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ నికితాపంత్ సూచించారు.





# పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



**నేడే మునిసిపల్ ఎన్నికలు - ఉదయం 7 నుంచి 5 గంటల వరకు పోలింగ్**

**ఐదు మునిసిపాలిటీల్లో 2.94 లక్షల మంది ఓటర్లు - మొత్తం 444 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు**

**ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు - మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**





**మంచిర్యాల, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

2వ మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11 వ తేదీన జరగనున్న పోలింగ్ నిర్వహణ కొరకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో కమిషనర్ అన్వేష్ తో కలిసి ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించి సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో ఈ నెల 11వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, 13వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్ లో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టి, సామాగ్రిని, సిబ్బందిని సురక్షితంగా కేటాయించిన ప్రకారం పోలింగ్ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడం జరిగిందని, ఈసారి ఎన్నికల నిర్వహణలో పోలీసు శాఖతో పాటు అటవీ, ఆబ్కారీ శాఖ సిబ్బంది సమన్వయం చేసుకొని ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు సర్వం సిద్ధంగా ఉన్నాయి. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్‌తోపాటు బెల్లంపల్లి, లక్షెట్టిపేట, చెన్నూర్, క్యాతన్‌పల్లి మునిసిపాలిటీలలో ఎన్నికలు జ రగనున్నాయి. మంచిర్యాల కార్పొరేషన్‌కు సంబంధించి ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో డిస్ట్రి బ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయగా, బెల్లంపల్లిముని సిపాలిటీలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నూరు మునిసిపాలిటీలోని అట వీశాఖ సమీపంలోని జడ్పీ హైస్కూల్, క్యాతనపల్లి మునిసిపాలిటీలోని ఆర్‌కేసీఓఏ క్లబ్, లక్షెట్టిపేట ముని సిపాలిటీలో పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏ ర్పాటు చేసి, వివిధ బల్దియాల పరిధిలో ఏర్పాటు చే సిన పోలింగ్ కేంద్రాలకు తరలించారు. డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మంచిర్యాల కార్పొరేషన్‌కు 265 బృందాలు, బెల్లంపల్లికి 68, చెన్నూ రుకు 36, క్యాతనపల్లికి 45, లక్షెట్టిపేటకు 30 బృందా ల చొప్పున సిబ్బందిని కేటాయించారు. వీరిలో మంచి ర్యాలకు సంబంధింది పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్, తదితరులు 1475 మంది ఉండగా, జోనల్ అధికారులు 10 మంది, మైక్రో అబ్జర్వర్లు 10 మంది ఉన్నారు.

**మొత్తం 444 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు...**

జిల్లాలోని మంచిర్యాల మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు ఎన్నికలు జరుగనున్న లక్షెట్టిపేట, చెన్నూర్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి మున్సిపాలిటీలలో ఓటింగ్ కోసం మొత్తం 444 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్ల ఇంటి నుంచి కనీసం అర కిలోమీటరు నుంచి గరిష్టంగా ఒక కిలోమీటర్ లోపు పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాల భవనాలతోపాటు కొన్ని చోట్ల ప్రైవేటు పాఠశాలల భవనాల్లోనూ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి కేంధ్రంలో గరిష్టంగా 800 మంది ఓటర్లను కేటాయించారు. మంచిర్యాల కార్పొరేషన్‌లో 265 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, లక్షెట్టిపేటలో 30 కేంద్రాలు ఏర్పాటు చేశారు. చెన్నూర్‌లో 36 కేంద్రాలు, క్యాతన్‌పల్లిలో 45 స్టేషన్లు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 68 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు...**

మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌శాఖ ఆధ్వ ర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. డీసీ పీ ఎగ్గడి భాస్కర్ నేతృత్వంలో 800 పై చిలుకు సి బ్బందితో ఎన్నికల బందోబస్తు నిర్వహించనున్నారు. జి ల్లాలోని ఐదు మునిసిపాలిటీల పరిధిలో ఏసీపీలు 06, సీఐలు 13, ఎస్ఐలు 33, ఏఎస్ఐలు/హెడ్ కానిస్టే బు ళ్లు 119, కానిస్టేబుళ్లు 375, హోంగార్డులు 166, ఆర్మ్‌డ్ సిబ్బంది 140, క్యూఆర్‌టీ టీమ్స్, రూట్ మొబైల్ పార్టీ లు, ఇతర డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన 100 మం ది ఎన్నికల బందోబస్తులో పాల్గొననున్నారు. జిల్లాలోని మొత్తం 444 పోలింగ్ బూత్‌ల పరిధిలో మొత్తం 179 సెంటర్లను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వాటిలో మంచిర్యాల పరిధిలో 110 బూత్‌లు ఉండగా, లక్షెట్టిపేటలో 08, చెన్నూరులో 22, బెల్లంపల్లిలో 22, క్యా తన్‌పల్లిలో 17 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. జిల్లా వ్యా ప్తంగా ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 163 బీఎన్‌ఎస్ సెక్షన్ అమలులో ఉండనుంది. పోలింగ్ బూత్ చుట్టుపక్కల ప్రచారం నిర్వహించడం, పార్టీల సింబల్స్ గల దుస్తులు ధరించడం, కరపత్రాలతో సంచరించడం, ఏరకంగానూ ఓటర్లను ప్రలోభ పెట్టడం, దూరప్రాంత ఓటర్లకు అభ్యర్థులు ట్రాన్స్‌పోర్టింగ్ సౌకర్యం కల్పించడాన్ని నిషేధించారు.





# జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

**నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికే జాబ్ మేళా**
**ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్**

**ఉట్నూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహించే జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలనీ ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ లోగల వైటీసీలో ఐటీడీఏ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాకు యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఓ పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగులను ఉద్యగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాను నిర్వహించడం జరిగిందన్నారు. అభ్యర్థులు జాబ్ చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలవాలన్నారు. 312 మంది విద్యార్థులు మేళాకు హాజరుకాగా 133 మందిని ఎంపిక చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అంతకుముందు ఇటీవల జిల్లా స్థాయిలో ప్రేరణ బాలికల క్రీడా పోటీలలో ఓరల్ చాంపియన్ షిప్‌తో పాటుగా ఇతర క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఐటీడీఏ పీఓ ఛాంబర్ లో అధికారులను పీఓ అభినందించారు. ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు క్రీడల్లో రాణించేందుకు మరింత పదును పెడుతున్నామని పీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ అంబాజీ, ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థ సారథి, వైటిసి జేడీఎం నాగభూషణం, హార్టికల్చర్ ఆఫీసర్ సందీప్ కుమార్, ఏసీఏంఓ జగన్ తదితరులు ఉన్నారు.





# ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**వాంకిడి, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని సరాండి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ భక్త ఆంజనేయ దేవాలయాన్ని ఆమె ప్రారంభించి గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భక్తి, శ్రద్ధలను అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు అజయ్ కుమార్, మాజీ సింగిల్ విండో చైర్మన్ జబరి పెంటు, సరాండి సర్పంచ్ బాపూజీ, గ్రామ పటేల్ కొట్రంగే మెంగాజీ, మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు శిండే వాసు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, గౌరయ్య పటేల్, మాజీ సర్పంచ్ దుర్గం కమలాకర్‌తోపాటు గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



# కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో పులిసంచారం



**బెజ్జూర్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ మండలం కోసిని కాలువ పరిసర ప్రాంతంలో పెద్దపులి సంచారం మంగళవారం కలకలం రేపింది. కోసిని వేంపల్లి అటవీ ప్రాంతాల్లో పులిసమాచారం సంచరిస్తున్నట్లు సమాచారం అందింది. పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. కోసిని వేంపల్లి గ్రామస్తులు అప్రమతంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు. కోసిని వేంపల్లి అటవీ ప్రాంతంలో పులి సంచరించడంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## మున్సిపల్ ఎన్నికల్లో

# బీఆర్ఎస్‌ను దీవించండి

**బోథ్ ఎమ్మెల్యే, నిర్మల్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి అనిల్ జాదవ్**

**నిర్మల్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిని విస్మరించి, అరాచకాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీని మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని బోథ్ ఎమ్మెల్యే, నిర్మల్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం నిర్మల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 26 నెలల కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క హామీ సక్రమంగా అమలుకాలేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మిన ప్రజలు గత అసెంబ్లీ ఎన్నికల్లో మోసపోయారని, మళ్లీ ఇప్పుడు ఆ పార్టీకి ఓటేసి మరోసారి మోసపోవద్దని సూచించారు. వారం రోజులుగా నిర్మల్ పట్టణంలో ప్రచారం కోసం ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్న విషయాన్ని గుర్తించామన్నారు. మహిళలు, వృద్ధులు, రైతులు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులతోపాటు అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. కేసీఆర్ పాలనే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్షలా భావిస్తున్నారని, ఎక్కడికి వెళ్లినా బీఆర్ఎస్‌పై ప్రజలు ఆదరణ చూపిస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యాయని, కేసీఆర్ పాలననే బాగుండే అన్న అభిప్రాయాన్ని ప్రతి ఒక్కరు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.





# సెలవనుకోకు.. బాధ్యత మరువకు..!

**ఓటు హక్కు సద్వినియోగంతోనే పట్టణాల అభివృద్ధి**
**ప్రగతికి బాటలు పడాలంటే ఓటు వేయాల్సిందే..**
**పల్లెలను స్ఫూర్తిగా తీసుకోవాలి**

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత సమాచారం)**

ప్రజాస్వామ్య సౌధం ఓటు అనే వజ్రాయుధంపైనే నిర్మితమైంది. ఈ ఆయుధాన్ని ఉప యోగించి ప్రజలు తమకు నచ్చిన వారిని పాలకులుగా ఎన్నుకునేందుకు వీలుంటుంది. నచ్చకపోతే అదే ఓటుతో గద్దెదింపేందుకూ అవకాశం ఉంది. మంచివారు అధికారంలోకి రావాలన్నా, పారద ర్శక పాలన కావాలన్నా.. ఓటును సద్వినియోగం చేసుకోవడం ముఖ్యం. ఓటు హక్కును పొందకపోవటం ఎంత తప్పో.. దాన్ని వినియోగించ కపోవటం అంతే పొరపాటు. అందుకే అందరూ నడుం బిగించాలి. దిశగా అడుగేయాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఈ హక్కుని ప్రతి ఒక్కరూ వినియోగించుకుం టేనే అసలైన జనస్వామ్యం. పురపాలక ఎన్నికల నేపథ్యంలో ప్రతి పౌరుడు ఓటు సద్వినియోగం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

**ప్రగతికి బాటలు పడాలంటే..**

ఓటు వేసే సమయంలో ఒక్క క్షణం ఆలోచించాలి. ఎవరికి ఓటు వేస్తే అభివృద్ధికి బాటలు పడతాయో గుర్తించాలి. నిస్వార్థంగా సేవలందించేవారిని గుర్తించి వారికే ఓటు వేయాలి. లేదంటే ఐదేళ్లు ఇబ్బందులు పడాల్సి వస్తుందని మరువొద్దు. సరైన అభ్యర్థులు గెలు పొందితే అన్ని రంగాల్లోనూ ప్రగతి పరుగులు తీస్తుంది. తాయిలాలకు లొంగితే అసమర్థులు పాలకులుగా ఎన్నికై అభివృద్ధి నిలిచిపోతుంది.

**పల్లెలను స్ఫూర్తిగా తీసుకోవాలి...**

పట్టణాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతోంది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గ్రామీణ ఓటర్లు అత్యధిక ఓటింగ్ శాతంతో ముందుంటు న్నారు. ఇటీవల నిర్వహించిన పంచాయతీ ఎన్ని కల్లో 87 శాతానికి పైగా పోలింగ్ నమోదయింది. గత మున్సిపల్ ఎన్నికల్లో 73 శాతం మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్రామీణ ఓటర్లను పట్టణ వాసులు స్ఫూర్తిగా తీసు కోవాల్సిన అవసరముంది. ఎన్నికలు జరిగే రోజును సెలవు దినంగా కాకుండా ఐదేళ్ల పాలనకు బాటలు వేసుకునేందుకు వచ్చిన అవకాశమని పోలింగ్ కేంద్రానికి కదిలితేనే ప్రగతి చేరువవుతుంది.